# రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు


ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడు చేస్తున్న హమాలీలు

- విక్రయించిన వారం రోజుల్లో చేతికి నగదు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

హుజూరాబాద్, డిసెంబర్ 2: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం డబ్బులు చేతికి వస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హడావుడి ఉన్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ, చెల్లింపుపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో మండలంలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతుండడం, ధాన్యం డబ్బులు సైతం వారం పది రోజుల్లోపే చేతికి వస్తుండడంతో రైతులు సంబురంలో ఉన్నారు.

### 1,959 రైతుల నుంచి సేకరణ

ధాన్యం సేకరణ దాదాపు పూర్తయింది. హుజూరాబాద్, జూపాక, తుమ్మనపల్లి పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రతి సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరిస్తున్నది. ఇప్పటివరకు 1,959 మంది రైతుల నుంచి 1,19,296 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసింది. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 991మంది రైతుల నుంచి 63,356 క్వింటాళ్లు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 752 మంది రైతుల నుంచి 46,960క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఐకేపీ ఆధ్వర్యంలో చెల్పూర్ కొనుగోలు కేంద్రంలో 216 మంది రైతుల నుంచి 8,980క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఇందులో దాదాపు సగంమంది రైతుల ఖాతాల్లో ఇప్పటికే ధాన్యం డబ్బులు జమయ్యాయి.

### సజావుగా కొనుగోళ్లు

గతంలో మాదిరిగానే వరి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకొంది. రైతుల సౌకర్యం కోసం ప్రతి గ్రామానికి ఓ కేంద్రం ఉండేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గత యాసంగి సీజన్ తరహాలోనే ఈ వానకాలంలో కూడా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడంలేదు.

#### దళారుల బెడద తప్పింది



ప్రభుత్వం ధాన్యం కొంటుండడంతో దళారుల బెడద తప్పింది. నేను దాదాపు 70క్వింటాళ్లు అమ్మిన. రూ.లక్షా 40వేలకు పైగా వచ్చాయి. ధాన్యం అమ్మిన వారంలోపే డబ్బులు ఖాతాలో పడ్డయ్. కేసీఆర్‌తోనే ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ సాధ్యమైంది. గతేడాది యాసంగిలో కేంద్రం తీసుకోపోయినా రైతులు నష్టపోవద్దని కేసీఆర్ ముందు పడి ధాన్యం తీసుకున్నడు.

*-కాసం రఘుపతి రెడ్డి, రైతు (కందుగుల)*

#### రూ.2లక్షలకుపైగా వచ్చాయి



వడ్లు అమ్మిన డబ్బులు బ్యాంకు ఖాతాలో తొందరగా జమ కావడం సంతోషంగా ఉంది. నేను దాదాపుగా 100క్వింటాళ్లు అమ్మిన. 2లక్షల రూపాయలకుపైగా వచ్చాయి. త్వరగా డబ్బులు రావడంతో రైతుల అవసరాలు తీరుతాయి. ప్రభుత్వం కొనకపోతే వడ్లకు గిరాకీ తగ్గేది. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం తీసుకోవడంతో మస్తు గోస తప్పింది.

*-కర్ర పాపిరెడ్డి, రైతు(హుజూరాబాద్)*

#### ధాన్యం సేకరణ దాదాపు పూర్తయింది



కొనుగోలు కేంద్రంలో అన్ని వసతులు కల్పించాం. రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటవెంటనే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నం. దీంతో రైతుల ఖాతాల్లోకి వారం పదిరోజుల్లోపే ధాన్యం డబ్బులు జమ అవుతున్నాయి. గన్నీ సంచుల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకొన్నాం. ధాన్యం సేకరణ దాదాపుగా పూర్తయినట్లే.

*-వివేక్, హుజూరాబాద్ సహకార సంఘం సీఈవో*

# భళా.. ఉజ్వల

- శ్రీశైలం శక్తిపీఠంలో నాట్యోత్సవాల్లో ప్రదర్శన
- అబ్బురపరిచిన నృత్యాలు


గుమ్మడి ఉజ్వలతోపాటు శిష్యబృందాన్ని ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

కోల్‌సిటీ, డిసెంబర్ 2: గోదావరిఖనికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి గుమ్మడి ఉజ్వలకు అత్యంత అరుదైన గౌరవం దక్కింది. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం శ్రీశైలంలోని శక్తిపీఠం దేవస్థానంలో నేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్, సౌత్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస నాట్యోత్సవాలకు కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి గుర్తింపు పొందిన కళాకారులకు ప్రదర్శనలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న గుమ్మడి ఉజ్వలతో పాటు శిష్య బృందం సీహెచ్ సహస్ర, వామిక, వంశిక, సాన్వి, వైష్ణవి, హానిక ఆనంద తాండవం, బ్రహ్మాంజలి, శివ స్తుతి, శివాష్టకం ప్రదర్శనలతో అబ్బురపరిచారు. దక్షిణ భారత దేశం నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులు పాల్గొన్న ఈ ఉత్సవాల్లో గోదావరిఖని నుంచి గుమ్మడి ఉజ్వల తన నాట్యంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నా రు. శివస్తుతిలో శివ పార్వతుల వేషధారణలో శివ కల్యాణం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చివరలో మంగళం పాడి ముగించారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్, కమిటీ సభ్యులు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం కళాకారులకు ఆలయంలో ప్రత్యేక దర్శనం తర్వాత ఆలయ మర్యాదలతో సత్కరించారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఉత్సవాలలో గోదావరిఖని నుంచి గుమ్మడి ఉజ్వల బృందం పాల్గొని తమ నాట్య విన్యాసాలతో గుర్తింపు సాధించడంపై కళాభిమానులు అభినందనలు తెలిపారు.

## ఈవీఎంల గోదాం పరిశీలన

పెద్దపల్లి, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ శనివారం పరిశీలించారు. గోదాంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## నరసింహస్వామికి విశేష పుష్పార్చన

వీణవంక, డిసెంబర్ 2: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని హరిహర క్షేత్రం యోగ నరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పుష్పార్చన కార్యక్రమాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో స్వామివారిని అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు ఫణీంద్ర భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.


పుష్పార్చన చేస్తున్న పురోహితులు

# ఓటింగ్ సరళిపై చర్చలు

- ఎక్కడ చూసినా పోలింగ్ తీరుపైనే ముచ్చట్లు
- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. నేడు ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో ఏ గ్రామంలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి.. తక్కువ, ఎక్కువకు కారణాలేమిటి, తదితర అంశాలపై లెక్కలు వేస్తూ అన్ని పార్టీల నాయకులు శనివారం కూడా బిజీబిజీగా కనిపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి ఓటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉన్న గ్రామాల్లో ఓట్లతో తాను ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే నలుగురైదుగురు కలిసిన చోట ఎన్నికల్లో గెలవబోయేది ఎవరు?, రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? అనే చర్చలు జరుగుతున్నాయి. కాగా, తెల్లవారితే మరికొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

# ఎన్నికల్లో 1981 పోస్టల్ బ్యాలెట్స్ నమోదు



హుజూరాబాద్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ రాజు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 2: హుజూరాబాద్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో ముందే జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్లను 1981 మంది వినియోగించుకున్నట్టు హుజూరాబాద్ ఆర్డీవో, రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్ రాజు తెలిపారు. కొందరు పోస్టల్ బ్యాలెట్ కోసం పేరు నమోదు చేసుకొని సమయానికి బ్యాలెట్ పత్రాలు తీసుకోలేదని, తీసుకున్న వారందరూ తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సులో పోస్టల్ ఓటు వేశారని వెల్లడించారు. దీనిని అభ్యర్థుల ఏజెంట్ల ముందు సీజ్ చేసి పోలింగ్ ముగిసిన అనంతరం ప్రిసైడింగ్ అధికారి, సెక్టోరల్ అధికారి, పోలింగ్ సిబ్బంది, ఎస్కార్ట్ పోలీసులతో ఆర్టీసీ బస్సులో ఈవీఎం యంత్రాలతో కలిపి కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు అదేరోజు తరలించామన్నారు. పోలింగ్‌లో వినియోగించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచామని చెప్పారు. ఆదివారం ఉదయం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఏడు గంటలకు పోస్టల్ బ్యాలెట్ల డబ్బాను తెరచి కౌంట్ చేస్తారని తెలిపారు.

# బీఎస్‌ఎఫ్ కమాండెంట్‌కు సత్కారం


బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనూజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 2: నియోజకవర్గంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో తమ వంతు పాత్ర పోషించిన బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనూజ్‌కుమార్‌ను శనివారం హుజూరాబాద్ ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, హుజూరాబాద్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఎస్‌ఎఫ్ కంపెనీ తరపున ప్రతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు కల్పించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, చిన్నపాటి గొడవ కూడా జరుగకుండా పూర్తిస్థాయిలో ప్రత్యేక భద్రత పోలీసు బలగాలు ఎంతో కృషి చేశాయన్నారు. అలాగే వారికి సహకరించిన సివిల్ పోలీసులు, ప్రత్యేక బలగాలు, అన్ని విభాగాల పోలీసు సిబ్బంది, అధికారులకు ఏసీపీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల కౌంటింగ్ వద్ద పటిష్ట భద్రత

- రామగుండం సీపీ రెమో రాజేశ్వరి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ జరుగనున్న కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరి తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని రామగిరి మండలం జేఎన్‌టీయూ కళాశాల, మంచిర్యాల జిల్లాలో హైజా ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వులు జారీ చేశారు. సమీప ప్రజలు సహకరించాలని, ఈ సమయంలో ఐదుగురు మంది కంటే ఎక్కువగా గుంపులుగా ఉండడం నిషేధమన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతం నుంచి కిలో మీటరు పరిధి వరకు ప్రజలు గుంపులుగా ఉండకూడదన్నారు. ఎవరూ పటాకులు కాల్చరాదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి రిటర్నింగ్ అధికారి జారిచేసిన ఫొటో గుర్తింపు కార్డు కలిగిన వారికి మాత్రమే భద్రతా సిబ్బంది అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులు కౌంటింగ్ హాల్‌లోకి నిషేధమన్నారు. గెలుపొందిన అభ్యర్థులు అదే రోజు విజయోత్సవ ర్యాలీలు తీయరాదన్నారు. ర్యాలీకి పోలీసు అనుమతి పొందాలన్నారు. ఓట్ల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు వైన్‌షాపులు, బార్లు మూసి ఉంటాయని పేర్కొన్నారు.